# పరమాన్నం

''అన్నం పరమాన్నం చాలా రుచిగా వున్నది సుశీ! యెలాచేశావో మరి. ప్రొసీజరు చెప్తే, వ్రాసుకుని నేనూ చేస్తాను. నేనూ చేస్తాగానీ, బాగా రాదు. తీర్థానికి తీర్థం ప్రసాదానికి ప్రసాదం. యేడుస్తూ తినాలి లేదా దిబ్బమీద పారబోయాలి.''

నించుని వంట చేస్తున్న సుశీ నవ్వుతున్నది. బుజాలెగురుతున్నాయి. పప్పు కూరలో తాలింపు పెట్టింది. చారుగిన్నె స్టౌమీదుంచి, పదార్థాలన్నీ వేసి, మూత వోరగా వుంచింది. టైం చూసింది. కుడివేపు స్టౌ ఆర్పేందుకింకా మూడునిమిషాల టైమున్నది. నీటౌంకాయలుకాల్చి బండపచ్చడి చేయాలి. భర్త సూర్యానికది చాలా యిష్టం.

''అన్నిటికీ నవ్వుతావెందుకూ?'' అన్నది సరోజ.

ఛిప్స్ తురుముతున్నది. మెషీన్ న్యూ మోడల్. బంగాళాదుంపలు వుప్పు నీళ్లలో కడిగి, మంచినీళ్లలో వేసి తీసి చెక్కులు తీసి మళ్లా నీళ్లలో వేసి తీసి చక్రాలు తరుగుతూ నీళ్లలోంచి తీసి తెల్లని బట్టమీద ఆరనిస్తున్నది. 'సరే నవ్వను. ఛిప్స్ పనికాలేదే. వ్రాసుకుంటావా? మెషీన్ అవతలుంచనా?'' అన్నది నవ్వాపుకుంటూ. ''అంత నవ్వెందుకొస్తుందీ? ప్రస్తుతానికి వింటాలే చెప్పు'' ఛిప్స్ తురుముతూనే వున్నది. మెషీన్ అవతలుంచాలని లేదు. చక్రాలు సన్నగా అందంగా త్వరగా వస్తున్నాయి.

''స్టౌ మీద యెసరుపెట్టి, బియ్యం కడిగిపోద్దామని చూస్తే రేషన్ బియ్యం లావుగా వున్నాయి. మట్టిబెడ్డలూ, ధాన్యపు గింజలూ దుమ్మూ ధూళీ. నిరాశపడక, త్రుటిలో ఫోనున్నగదిలో కెళ్లి నంబర్ డయల్ చేశాను.''నిమ్మీ! మీ అమ్మగారు వచ్చినప్పుడు సన్నబియ్యం తెల్లనివి, తెచ్చారని చూపావు.

ఇంకావున్నాయా? చిన్నగిన్నెడు చాలు. మావి రేషన్ బియ్యం సాయంకాలం నాకు మార్కెటింగ్ పనివున్నది. అక్కడ సూపర్ బజార్లో సన్నని బియ్యం బసుమతి తెస్తాను. రాత్రికి నీ గిన్నెడు బియ్యం తీర్చేస్తా. ఆ? రానా? వస్తున్నా.'' అని ఫోన్ క్రేడిల్లో పడేసి, ఒక్కంగలో పై ఫ్లాట్‌లోకెళ్లి బియ్యం తెచ్చి గబగబా కడిగి, మరుగుతున్న యెసట్లో పోశాను. సగం వుడకంగానే పాలుపోద్దామని, ఫ్రిజ్ తీసిచూస్తే పాలు లేవు. కండెన్స్‌డ్ మిల్క్ డబ్బా పూర్తి అయిపోయింది. ఒక్క అంగలో యెదురుభాగంలో దూరి, వాళ్లెందుకో తలుపు తీసి వుంచారు. ''యేవండేవండీ! చిన్న గిన్నెడు పాలు యివ్వరూ? మాఫ్రిజ్ పనిచేయటం లేదు. రిపేరు చేయిస్తున్నారు. విరిగిపోతాయని పాలు నిలువచేయలేదు'' అంటే, గాజు గ్లాసులో పాలు పోసిందామె. నేను వచ్చేప్పటికి సరీగ్గా సగం వుడికి పైకి చిక్కని గంజి తేలుతున్నది. యీ పాలు పోసి కలియబెట్టాను. ముద్దగా అవుతున్నది. పంచదారా బెల్లమా అని మీమాంస వచ్చింది. కొత్తబెల్లం వస్తున్నది. తేనెరంగు రుచీ, మెత్తదనం గుర్తు వచ్చింది. కింద ఫస్ట్ ఫ్లోర్లో డిపార్ట్‌మెంట్ స్టోరున్నది. వందనోటు పట్టుకుని చెంగున వెళ్లి, బెల్లం పొట్లం తీసుకుని, నూరునోటు, కాషియర్ కందిస్తూ, ''చిల్లర లేదండీ'' అని దేబెలాగా చూసి నైలాన్ పమిట జారిపోతున్నదని గమనించి, దిద్దుకుంటూ కళ్లు వాల్చి, రెప్పలల్లార్చేప్పటికి, కాషియర్ సొరుగులాగి చూసి అన్నీ యాభై నోట్లేనని గమనించి, పొట్లం వంక చూస్తే పావుకేజీ ప్యాకెట్ కంటబడింది.

''ఫరవాలేదులెండి. సాయంకాలం తెచ్చివ్వండి'' అన్నాడు. నా వెనక యింకా స్త్రీలు వరసలో నిలబడి వున్నారు.

రెండేసి మెట్ల చొప్పున కప్పదాట్లు వేస్తూ వచ్చి, బెల్లం తీసి చితిపి పరమాన్నంలోవేసి గరిటతో తిప్పాను. పల్చగా అయింది. తీపి తక్కువైందేమో, కొంచెం పంచదార కలపాలేమోనని స్పూన్‌తో తీసి చల్లార్చుతుండగా రుచి చూసి,

ఒక్క టేబుల్ స్పూను పంచదార కలిపితే మంచి రుచి వస్తుందని కలిపి తిప్పుతూ మళ్లా రుచి చూస్తుండగా, మూడవ అంతస్తులో అమ్మాయి వచ్చింది.

''నూరు నోటుకి చిల్లరివ్వరూ? స్టీలు గిన్నెలవాడొచ్చాడు. నాకు నచ్చిన గిన్నె అందింది. మందంగా వుండి అడుగున రాగి కోటింగ్ వున్నది. పాలు మాడవు. ఇచ్చిన చీరలు తీసుకుని 'ఒక్క అయిదు రూపాయలిప్పించరూ? మీకు నచ్చిన గిన్నె యిచ్చాను' అన్నాడు. వాడడిగినది పారేసి గిన్నెవుంచుకుందామని చూస్తే చిల్లర లేదు. వాడి దగ్గరాలేదు. పరుగెత్తుకొచ్చా ఆంటీ! వాడు మెట్లమీదున్నాడు. తలుపు లాక్ చేసి వచ్చా'' అని ఆయాసపడింది.

పరమాన్నం మాడకముందు, మరీ ముద్దకాకముందు జారుగవుండగా దింపేశాను. సిమ్ మీదున్నది స్టౌ. బాండీ వుంచి నేయి వేశాను.

''నువ్వు పరుగెత్తుకెళ్లి నాలుగు జీడి కురుడీలు, నాలుగు కిస్‌మిస్ పట్రా లతా! అందమైన ప్లాస్టిక్ బాటిల్స్‌లో వుంచుకుంటే చూశాను లతా! మళ్లా తీర్చేస్తా. నువెళ్లి తీసుకురా. నేనీలోపల చిల్లర వెతికి తీసి వుంచుతా'' అని తోలాను. అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చి, నేనడిగినవి పళ్లెంలో వుంచి, చిల్లరందుకుని పరుగెత్తింది లత. వాటిని తుంచి ఒలిచి, తొడిమలు పారేసి, నేతిలో వేయించి, చల్లారుతున్న పాయసంలో నేతితో సహా వేశాను. కుంకుమ పూవు వెతికి కొద్దిగా తుంచి వేస్తుండగా లిల్లీ అనే పదేళ్లమ్మాయి వచ్చింది.

''యేం కావాలి లిల్లీ?''

''మా అమ్మ మీ చపాతీ మెషీన్ ఒకసారడిగా తెమ్మన్నది. ఇప్పుడే యిచ్చేస్తుందట. మా చపాతీ కట్టె కనబడలేదు. పొద్దెక్కుతున్నది.''

''తుడిచిస్తా లిల్లీ! నువెళ్లి మీ అమ్మ చూడకుండా నాలుగు యేలకిపళ్లు గుప్పిట్లో దాచి తీసుకురా.''

లిల్లీ పరుగెత్తింది. నిమిషంలో వచ్చి యేలకులు పళ్లెంలో వుంచి నవ్వింది. నేను మెషీను సంచీలో వుంచి అందిస్తే చిన్న చాక్లెట్ కాగితం వూడదీసిస్తే, నోట్లో వేసుకుని చప్పరించి బుగ్గకి నెట్టి నవ్వుతూ వెళ్లింది.

''యేలకులు ఒలిచి పింగాణీ పాత్రలో వేసి మెల్లిగా దంచి పొడివేసే సమయానికి పరమాన్నం చల్లారి, జీడి పలుకులూ, కిస్‌మిస్, కుంకుమపువ్వూ తేలుతూ కనిపించింది. యేలకిపొడివేసి కలుపుతుండగా నువ్వు వచ్చావు. ఫ్రెండువని కప్పులో గరిటెతో పోసి నీకిచ్చాను'' అన్నది సుశీ. ఈ మాటు నవ్వటం సరోజ వంతైంది.

''బాండీలో ఆయిల్ పోశావా? చక్రాలు తయారయాయి. మెషీను అవతలుంచుతున్నాను'' అన్నది.

'' ఓ. రెడీ. నీకూ నవ్వు వచ్చిందే సరోజా! మా పిన్ని సేమియా పాయసం చేసిందంటే అమృతమేననుకో. ఆమే రొమాంటిక్. ఆమె రొమాన్సులాగే ఆమె పరమాన్నం గూడా మంచి రుచి. ప్రొసీజరు కావాలంటే చెపుతా. మరో పెత్తల్లి కూతురు నూకల పరమాన్నం చేస్తుంది. జిహ్వ లేచి వస్తుంది'' సుశీ చిల్లు గరిటా, పళ్లెం అందుబాటులో వుంచింది. అన్నీ అడ్డం తీసేసింది.

''కావాలి. కావాలి. అవీ కావాలి. సేమియా పాయసమూ విరిగిపోయింది. ప్రొసీజరు రాదనుకున్నా. నూకల పరమాన్నం అసలు వినసే లేదు. కానీ, ఇవి వేయించేలోపల పూర్తి చేయి'' అన్నది సరోజ. గుడ్డమీది చక్రాలు పళ్లెంలో వుంచి తెచ్చి ఒక్కొక్కటే నూనెలో వేస్తున్నది.

'పరమాన్నమంటే పరాయి సొమ్మని తేల్చావు సుశీ'' అన్నది నవ్వుతూ.

''అంతే మరి. అందుకే అంత రుచి. అసలు కంటే వడ్డీ ముద్దు. 'పరమాన్నపూ అపవాదా' అని పాడారు త్యాగరాజస్వామి. నా చిన్నప్పుడు నా

పెత్తండ్రి తరుచు వచ్చి, విస్తరెడు అన్నం స్వాహా చేస్తూ 'వదినగారూ! పప్పు పులుసెంత రుచిగా చేశారు? మా ఆవిడ చేస్తుంది. విస్తరి వదిలి వెళ్లిపోవాల్సిందే మరి' అనేవాడు. నా పెత్తల్లి వంట. మా అమ్మ పురటాలు. గదిలో వున్నది. మా పెత్తల్లి అంటించేది. ''అవును మరిదిగారూ పరాయి సొమ్ము పరమాన్నంలాగా రుచి.'' నీ కిష్టం లేకపోతే ప్రొసీజరు చెప్పను. గొంతు నెప్పితో బాధపడుతున్నా'' అని దగ్గింది సుశీ.

''కావాలి మహాతల్లీ చెప్పు. వింటాను'' అన్నది సరోజ మొదటి వాయ చట్రంతో తీసి పళ్లెంలో వేసింది.

2

చెల్లెలు సుబ్బలక్ష్మి రావటం అప్ప నాగలక్ష్మి చూసింది. చాలా సంతోషించింది. యెందుకనంటె ఆమె ముద్దుల చెల్లెలు రేడియో అనౌన్సర్‌లాగా వార్తా ప్రసారం చేయటానికీ, తన స్వంతపనిమీదా వస్తుంది. ముద్దుల చెల్లెలు స్వంతపనిగూడా యింటెరెస్టింగా వుంటుంది తెలుసుకోటానికి. సందడి చేస్తుంది. హాస్యాలాడుతుంది. తమ పుట్టిన వూళ్లో వున్న తన వియ్యాలవారి పేలాపనా గుట్టూ మట్టూ సేకరించి వచ్చి అభినయంతో సహా చెప్తుంటే వినసొంపుగా వుంటుంది. నాగలక్ష్మి వియ్యాలవారికీ నాగలక్ష్మికీ మధ్య పచ్చగడ్డి వేస్తే పెద్ద వెలుగు వస్తుంది. అదీ సందర్భం.

''రావే. లచ్చాం. యెక్కడనించీ రావటం? నీ కొడుకెటో పారిపోయినాడని విన్నానే. అందాడా?'' అంటూ వామ్ వెల్‌కమ్ యిచ్చింది చెల్లెలుకి. కాళ్లు కడుక్కునేందుకు నీళ్లిచ్చింది. వేడి వేడి కాఫీ తెచ్చి బల్లమీదుంచింది. పేము కుర్చీ తెచ్చివేసింది.

లచ్చాం కాళ్లూ చేతులూ మొహం కడుక్కు వచ్చింది. చీర పమిట

కొంగుపెట్టి మొహం తుడుచుకున్నది. కొంగు చివరముడివిప్పి కాగితప్పొట్లం వూడదీసి చిటికెడు కుంకుమ తీసి గుండ్రంగా తిప్పి కనుబొమల మధ్య పెట్టుకున్నది. కాఫీ అందుకుని చప్పరిస్తూ అన్నది.

'' ఈ వూళ్లో మంచి సంభంధాలున్నాయని చెప్పారే నాగక్కా. కూతుర్ని పట్టుకోలేకపోతున్నా. 'యెక్కడికీ పోనీయవు. పెళ్లి చేసి పంపేయి' అని యిల్లంతా చిందులు తొక్కుతుంది. అనూరాధకు క్షణం కాలునిలవదింట్లో'' అన్నది కాఫీ సేవిస్తూ.

''బడికి పోవటం లేదూ అనూ? మానేసిందా?'' అన్నది నాగలక్ష్మి. కూర తరగాలని కత్తిపీటా అరిటికాయలూ తెచ్చికూచున్నది.

''అయిపాయె సంబంధం. బడికి పోతున్నానని పోయి అందరిళ్లలో దూరి నా మీద చాడీలు చెపుతుంది'' అని నవ్వుతున్నది లచ్చాం.

''యేమని చెప్పుతుందీ చాడీలు? కూతుర్ని ముద్దుగానే పెంచుతున్నావే. పట్టు పావడా, పట్టు జాకట్టూ, పట్టు వోణీ తలకు వాసన నూనె, చెవులకి జూకాలు, పాదాలకి పట్టాలు, తలకు నాగరం, జడ కుప్పెలు'' అంటున్నది నాగక్క. అరిటికాయలు చెక్కు తీసి ముక్కలు తరిగి నీళ్లగిన్నెలో వేసింది.

''కల్పించి చెపుతుంది. బడికీ పోనివ్వనట, పెళ్లీ చేయనుట. సంబంధాలవే వస్తే 'బాగోలే'వని తిప్పేస్తున్నాట. ఆ కట్టేవి యిమిటేషన్ సిల్కుట. అవి మాయనగలట. అలా అంటూ వాళ్లు పెట్టే చేగోడీలు జంతికలు మేసి, బడి వదిలేవేళకి పరుగెత్తి బళ్లో దూరి, పిల్లలతో కలిసి బడినించి వస్తూ కంటబడుతుంది. నీకూతురల్లే ముద్దరాలుగాదునా కూతురు. చిచింద్రీ'' అని మూతి తిప్పి తలతిప్పి, కూతుర్ని తలుచుకు మురిసిపోయింది సుబ్బలక్ష్మి.

నాగలక్ష్మి లేచి, కత్తిపీట గోడవారగా వుంచి వంటింట్లోకి దారితీస్తే

సుబ్బలక్ష్మి లేచింది. కాఫీ గ్లాసు కడగటానికి దొడ్లోకెళ్తే, పెద్దకాగులో నీళ్లు కాగుతూ కనిపించాయి. వంటింట్లో కొచ్చి గ్లాసు బోర్లిస్తుంటే పెద్ద పళ్లెంలో సేమియా పొట్లాలు తళతళలాడుతూ కంటబడ్డాయి. కళ్లు మెరమెరలాడాయి సుబ్బలక్ష్మికి.

'' ఇప్పుడు నీళ్లెవరికే నాగక్కా? నీళ్లు మసులుతున్నాయి. అన్ని సేమియాపొట్లాలెందుకొక్కొన్నావూ?'' అన్నది.

''నీళ్లు నీకే. బావగారొచ్చి స్నానం చేస్తారు. పద బకెట్లో పాళాలు చేస్తా.'' కుంపటి వెలిగించి కూరగిన్నె యెక్కించింది. చిటికెడు పసుపువేసి మూత ఓరగా పెట్టింది.

ఇత్తడి బకెట్ పెద్దది. దాన్నిండా నీళ్లు పాళాలు చేసింది. ఇద్దరూ తోడుబట్టి స్నానాల గదిలోకి మోసుకెళ్లి నేలమీదుంచారు.

'' ఇన్ని నీళ్లా? తలంటికి సరిపోతాయి. పోసుకోనా? తల మాసింది. ఇంటి దగ్గర తీరుబాటే లేదు'' అన్నది చెల్లెలు.

''పోనీ అదే కానీలే లచ్చీ! ఇదుగో గూటిలో నూనెసీసా. ఆ చిన్న అల్మరలో సున్నిపిండి గిన్నె, పసుపు పొట్లం, కొట్టివుంచిన కుంకుడు కాయల పొట్లం వున్నాయి. తలుపేసుకో'' అని పోబోయింది నాగక్క.

'' ఉండు. పోవోకు. ఈ చీరతో ఒళ్లు తుడుచుకుని, పిడప వేస్తే అంతా తడిసి ముద్ద అవుతుంది. పాత చీర వుంటే యియ్యి. ఇవాళే వెళ్లిపోవాలని రెండో బట్ట తేలేదు.''

''తేక్కర్లా. చుట్టబెట్టుకురా. వీధిలోకి చీరల మూట వస్తే, అద్దకం చీర కొన్నాను. అది కట్టుకుందువుగాని'' అని తలుపు చేరవేసి వెళ్లిపోయింది నాగలక్ష్మి.

జుట్టు ఆరాలని, బుట్టకింద నిప్పులచట్రం మీద సాంబ్రాణీ చల్లి, బుట్ట పైకి పొగవస్తుంటే, జుట్టు దానిమీదుంచి తలాడిస్తూ తలారబెట్టుకున్నది సుబ్బలక్ష్మి.

''చీర చాలా మెత్తగా తేలిగ్గా వున్నాదే నాగక్క. మళ్లా మూటలవాడొస్తే నాక్కూడా తీసుకో. డబ్బు పంపిస్తాలే. సేమియా పరమాన్నం వండాలా? యెందుకు?'' అనడిగింది సుబ్బలక్ష్మి.

'' ఆ పొట్లాలా? నాలుగిళ్లవలతల చంద్రముఖి సేమియా చేసే మెషీన్ కొనుక్కున్నదట. సేమియా నాజూగ్గా సన్నగా, బంగారు తీగెలాగా చేసింది. పొట్లాలలోది తెచ్చి యిచ్చింది. తెలిసినవాళ్లకు అమ్మి పెట్టమన్నది. సరే నన్నా. చెరిసగం. నువు సేమియా పరమాన్నం వండుదువుగానిలే'' అన్నది అప్ప. వంట అయింది.

''నేనో పొట్లం తీసుకోనా? సగ్గుబియ్యం వున్నాయా?''

''వున్నాయి. నువ్వు నీ క్కావాల్సినవి తీసుకో.''

''సగ్గు కూడా ఓ సీసాలో పోసియ్యి. పద వడ్డిద్దాం.''

3

సాయంకాలమైంది. ''వరాకులాగా వేయిస్తానే నాగక్క'' అంటూ మినపరొట్టెలు నేయి వేస్తూ దోరగా వేయించి అందరికీ పంచమన్నది సుబ్బలక్ష్మి. స్ట్రాంగ్ కాఫీ చేసి కప్పుల్లో పోసింది.

''నేను వెళ్లి పెళ్లికొడుకును చూసి వస్తా నాగక్కా. నచ్చితే పిల్లవాడు నదరుగా వుంటే వాళ్ల కోరికలు తెలుసుకోవాలి. నేను వచ్చేప్పటికి ఆలస్యం కావచ్చు. నువ్వు భోజనం కానిచ్చేయ్. యెదురుచూడకు. నేనన్నం తినే రావచ్చు'' అని నవ్వింది సుబ్బలక్ష్మి.

నాగక్కకి అర్థంగాలేదు. ''అంత సేపేం చేస్తావు? మన పక్కింటి అంచాయమ్మకి బురిడీ వేసి ఆమె జిగినీ గొలుసు పెట్టుకెళ్తున్నావే? ఒక గంటలో పని కానిచ్చి వస్తానంటివే ఆమెతో?'' అనడిగింది.

''నీకు చాదస్తం యెక్కువౌతున్నది నాగక్క. అందుకే డమ్మాలాగా వున్న అంబాయమ్మ 'అవ్వగారూ!' అని పిలుస్తున్నది. అని నవ్వి, అక్క మీదికి వంగి చెవిలో రహస్యంగా చెప్పింది.

''అందుకే నీ పట్టుచీర సింగారించా. ఈ చీరలో నేను మరింత అందంగా వున్నా. ఈ పెద్దజాజిదండ ధమ్మానడిగి తెచ్చుకున్నా'' అని కులికి వూగుతూ నవ్వింది చెల్లెలు.

''యెంతిస్తాడేమిటి నకలు మరిది'' అని తానూ నవ్వింది నాగలక్ష్మి.

''వెయ్యి యివ్వచ్చు. నేర్పుగా మరో వెయ్యిలాగాలి. అందుకే ఆలస్యమౌతుందేమో నన్నా. తనను చూసిపొమ్మని కార్డు పడేశాడు. భార్యా పెల్లికెల్లిందట. ఆరోగ్యిష్టిది నీ వియ్యాలవారికి దూరపు బంధువు. అదే పనివేళా నా యింటికి వచ్చి, నీ వియ్యాలవారెలా నోరుపారేసుకుంటున్నారో చెప్పింది. నేను నీవియ్యాల వారింటికి పని కట్టుకు వెళ్తానా? ఒక్కనాటికి వెళ్లను'' అని తల అడ్డంగా ఆడించింది.

''యేమని చెప్పింది రోగిష్టిది?'' కళ్లు చిన్నవి చేసి సూదులు గుచ్చుతున్నట్లు చూస్తూ కుతూహలం వెల్లడించింది నాగలక్ష్మి.

సుబ్బలక్ష్మికి చెప్పాలనే ఉబలాటం ప్రోత్సహించగా, ''నువ్వు వెల్లి లబలబలాడితే 'పోనీ మనవాళ్లే. ఆమూడు ముళ్లూ పడ్డాయి అనిపిద్దాము. పిల్ల నింద పడదు. తెచ్చేసుకుంటే పనిమనిషిగానన్నా పనికిరాకపోతుందా? కట్నంలాగే ఆచారం లేదైపాయె' అనుకుని, పెద్దమనసుతో లగ్గం పెట్టించారట. 'పిల్లవంటి

మీద బంగారం పెట్టవా? యేబ్రాసినిస్తావా?' అంటే పెడ్తానని మాటిచ్చావుట. యేమేమి పెట్టాలో చెప్పారట'' అని నవ్వసాగింది సుబ్బలక్ష్మి.

''కానీ మరీ. పూర్తి చేయి. తరవాత నవ్వుకుందాము.''

''విభూతి మంత్రించి పెట్టి జరాలు నయం చేసి సంపాయించిన డబ్బూ, మంత్రజాలం మీద వచ్చినదీ వుపదేశాల వల్ల వచ్చినదీ కలిపినా చాలక, సగానికి సగం నగలు మాయనగలు పెట్టావుట. ఆమోసం పీటల మీదుండగా తెలిసిందట. తప్పు పనిచేశావని పెళ్లి ఆపేశారట. మాట తప్పిన మనిషి విభూతి ముండ కూతురు మా అబ్బాయి కక్కర్లేదని పెళ్లిపందిరి వదిలివెళ్లి పోయారట'' అని నవ్వుతున్న చెల్లెల్ని చూసి నొచ్చుకోక నాగలక్ష్మి నవ్వుతూనే అన్నది.

''కాని లచ్చాం! చింతపండూ బెల్లం జీలకర్రా కలిపి ముద్దచేసి తమలపాకు మీదుంచి తలమీద పెట్టించగానే పెళ్లి అయిపోయినట్లే అన్నాడే పురోహితుడూ?''

''కాదుట. సూత్రధారణ, తలంబ్రాలూ, చదివింపులూ, అంపకాలూ, గృహప్రవేశం, వ్రతం కాకపోతే, కానట్టేట. దాని కూతురు కొడుకును గన్నా ఆస్తిలో భాగం రాదుట. అంతగా మీరు కోర్టుకీడిస్తే పాతికవేలిచ్చి వదిలించుకుంటారుట గానీ, గడపలోకి రానివ్వరుట'' అని నవ్వింది చెల్లెలు. నోటి మీద చెయ్యివుంచుకుని నవ్వాపుకుంటున్నది.

''యేవీ పాతికవేలు? పిండానికి సరిపోయేదిస్తున్నాడు దానికి దగుల్బాజీ అల్లుడు. చూస్తా. చూస్తా. ఓనాడు నిజంగా పాతికవేలూ వాళ్ల దగ్గర్నుంచి లాగకపోతే మతం మార్చుకుంటా'' అన్నది దర్పంగా.

అది ఛాలెంజ్‌లాగా వినిపించింది సుబ్బలక్ష్మికి.

4

మరునాడు పొద్దున పదిన్నరకి,

''నాగక్కా! వంటాపెట్టూ అయిపోయిందిగా.

తలుపుతాళం పెట్టిరా. ఆడమ్మా జిగినీ గొలుసు యిచ్చి వద్దాం. మళ్లా దానితో పనిబడవచ్చు'' అని పిలిచింది సుబ్బలక్ష్మి.

ఇద్దరూ వెళ్లారు. సుబ్బలక్ష్మే తలుపు తట్టింది.

''వదినగారూ! ధమ్మా గారూ!'' అప్ప నవ్వియెటో చూసింది. కొంత ఆలస్యమైంది. పావుగంట తర్వాత తలుపులు తెరుచుకున్నాయి.

''లోపలకి రండి. అన్నానికి కూచున్నాను. మీరు తలుపు తట్టారు. అన్నం చల్లారిపోతుంది. త్వరగా లేవలేను. అన్నం తినాలి. విస్తరిమడవాలి. చెయ్యీ మూతీ కడుక్కోవాలి. ఆలస్యమైంది''అన్నదంబాయమ్మ.

''వెళ్లిన పని నెరవేరింది ధమ్మా గారూ! మా అమ్మయిని చేసుకుంటామన్నారు. నేనడగంగానే మెళ్లో నగ తీసి యిచ్చారు. నేను పెట్టుకెళ్లాను. దాని ప్రభావమే అది. అల్లుడు చిన్నవాడే. ఉద్యోగి. భూములున్నాయి. భవంతి వున్నది. అద్దె వస్తుంది. ద్వితీయమైతేనేం? ద్వితీయం తృతీయమని నేను వంక పెట్టను. పిల్లవాడు కంటికి నదరుగా వుండాలి. పొడగరే. పసిమి. సంతానం కలగకముందే భార్య ప్రమాదంలో పోయిందిట'' అని కబుర్లాడింది సుబ్బలక్ష్మి.

అంబాయమ్మ కుర్చీలు చూపి కూచోమన్నది. సుబ్బలక్ష్మి యిల్లు చూస్తానన్నది. ఇల్లంతా తిరుగుతూ చూసింది.

అల్మరలకు తలుపులు లేవు. ఒక గాజు గిన్నెలో యేలకులు కంటబడ్డాయి సుబ్బలక్ష్మికి.

'' ఇన్నెందుకున్నాయి వదినగారూ? నేను కాసిని తీసుకోనా?'' అన్నది సుబ్బలక్ష్మి.

''పరమాన్నం చేసుకుంటారా?'' అనడిగింది అంబాయమ్మ.

''మరే. ధమ్మాగారూ! మీరు పచ్చ కర్పూరం వాడతారా?'' అన్నది.

అంబాయమ్మ తలూపుతూ గుప్పిలిలోకి సరిపోయే యేలకులు తీసి పొట్లం కట్టి యిచ్చింది. తలగోక్కుంటూ డబ్బీ తీసి పచ్చకర్పూరపుబిళ్ల ఒకటి తీసి పొట్లం కట్టి సుబ్బలక్ష్మికిచ్చింది. సుబ్బలక్ష్మి వాటిని తన కొంగుచివర కట్టి ముడివేసింది.

హాలులో కొచ్చారు. సుబ్బలక్ష్మి, సీల తిప్పి జిగినీ గొలుసు తీసి అంబాయమ్మ మెళ్లో పెట్టి సీల తిప్పింది.

'' ఇచ్చిన జ్ఞాపకం గిచ్చిన జ్ఞాపకం'' అంటూ ఆమె బుగ్గ గిల్లి నవ్వింది. వాకిలి వేపు వెళ్తూ అన్నది.

''వస్తాంధమ్మాగారు. మా అమ్మాయి పెళ్లి యీ వూళ్లోనే చేస్తాను. మిమ్మల్ని పిలవటానికి వస్తాను. పెళ్లి పందిరిలో నిండుగా, పిప్పళ్ల బస్తాలాగా వుంటారు వదినగారూ. తలుపేసుకోండి. కునుకుతీసేవేళ. ఆవలిస్తున్నారు'' అన్నది.

తలూపుతూ వెంట వచ్చి తలుపేసుకున్నదంబాయమ్మ. అప్పచెల్లెళ్లు నవ్వుకున్నారు.

''ఆవిడకీ మధ్యే చెముడేర్పడింది. నువ్వు బలేదానివే లచ్చీ. అనదలచినదేదో అనేశావు'' అన్న దప్ప.

మరునాడు రాత్రి యేడుగంటలకి భోజనం కానిచ్చి బయలుదేరింది సుబ్బలక్ష్మి. అప్ప నాగలక్ష్మి అన్నది.

''వున్న నాల్రోజులూ యింత రుచిగా చేసి పెట్టావే లచ్చాం. పరమాన్నంలోకి జీడి కురిడీలూ, కిస్మిస్ యెక్కడివీ?''

సరోజ సేమియా పొట్లం కోసం వస్తే దానికో కప్పు పరమాన్నమిచ్చా.'' 'చాలా రుచిగా కుదిరింది ఆంటీ. పరమాన్నం విరగలేదు. యెలా చేశారో చెప్పరూ?' అన్నది. ''నేను చేయలేదు నా చెల్లెలు చేసింది. దాన్ని అడుగు చెపుతుందన్నాను.''

''వాడే యిచ్చాడు. వాడికి డిపార్ట్‌మెంటల్ స్టోరున్నదని చెప్పానే. నీకూ చాదస్తంతోపాటు చెముడు గూడా పట్టుకున్నదేమో'' అని నవ్వింది సుబ్బలక్ష్మి.

''నాకు కొంచెం సీసాలో పోసి బిగించావా? రైల్లో పూర్తి చేస్తా. యింటికి చేరేప్పటికి రాత్రి పదవుతుంది.''

రైలెక్కి, రైలు కదలబోతుండగా అన్నది.

''నీవు సర్దిపెట్టి యిచ్చిన ఆవకాయా, మాగాయా, పళ్ల గోంగూర పచ్చడీ చాలా రుచి నాగక్క. అది కొండ గోంగూర. అందుకే ఆ పులుపు. చీర ఖరీదు పంపుతా'' అని చెయ్యివూపింది.

''అక్కర్లేదులే'' అంటున్నది నాగలక్ష్మి. రైలు కదిలిపోయింది. తనక్కావల్సిన ఇన్‌ఫర్మేషన్ తెచ్చింది చెల్లెలు.

## 5

సరోజను చూడవెళ్లిన సుశీ ఆమె యిచ్చిన పరమాన్నం స్పూనుతో తింటూ, ''చాలా రుచి'' అన్నది.

''అది మీ పిన్ని చేస్తే, నేను వెళ్లినప్పుడు ఆంటీ నాకూ యిచ్చారు'' అని నవ్వసాగింది సరోజ.

''ప్రొసీజరడగలేదూ ? నేనడిగాలే.'' సుశీ నవ్వుతూ అన్నది.

'' ఆ. ఆ. ప్రొసీజరు తెలిసింది. మరి నూకల పరమాన్నం ప్రొసీజరూ తెలుసుకోవద్దా? చెప్పవూ?''

ఇద్దరూ నవ్వుతూ చూసుకున్నారు.

''తప్పకుండాను. మరోసారి చెప్తా. అది మా పెద్ద ఆంటీ పెద్ద కూతురుకి బాగా వచ్చు'' అన్నది సుశీ.